క్లుప్తంగా

మారయ్యను పరామర్శించిన ఆడారి



పార్టీ నాయకుడు మారయ్యను పరామర్శిస్తున్న ఆడారి ఆనంద్ కుమార్, బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు పద్మనాభ నగర్‌కు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు సాలాపు మారయ్యను పశ్చిమ సమన్వయ కర్త ఆడారి ఆనంద్ కుమార్, జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు పరామర్శించారు. ఇటీవల ఆయన తీవ్ర అనారోగ్యంతో ఆస్పత్రిలో వైద్యం పొంది ఇంటికి చేరుకున్నారు. ఈ మేరకు శనివారం ఆయన నివాసానికి వెళ్లి అనారోగ్యానికి కారణాలు తెలుసుకున్నారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

ఇందిరానగర్‌లో గడప గడపకు ..



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న పశ్చిమ సమన్వయకర్త ఆనంద్‌కుమార్

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు ఇందిరా నగర్‌లో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ పాల్గొని ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, 91, 92 వార్డు అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి నాయుడు, ఊటపల్లి గోవిందు, కె త్రినాథ్, విజయ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏఏటీ బృందం పర్యటన



అక్కిరెడ్డిపాలెంలో బీఎల్ఓతో కలిసి సరిహద్దును పరిశీలిస్తున్న ఎస్ఎస్ఏఏటీ బృందం

అక్కిరెడ్డిపాలెం: రాష్ట్ర ఎన్నికల అధికారి ఏర్పాటు చేసిన సొసైటీ ఫర్ సోషల్ ఆడిట్, అకౌంటబులిటీ అండ్ ట్రాన్సపరెన్సీ (ఎస్ఎస్ఏఏటీ) బృందం 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం సచివాలయం పరిధిలోని బీఎల్ఓతో కలిసి క్షేత్రస్థాయి పర్యటన చేసింది. శనివారం సచివాలయం పరిధి బీఎల్‌వో బండారు శ్రీనివాసరావు బృందాన్ని గ్రామంలో ఓటర్ల జనాభా ఆధారంగా ఓటర్ సీరియల్ నంబర్ల ప్రకారం సరిహద్దును చూపారు. ఈ సందర్భంగా సోషల్ ఆడిట్ బృందం సభ్యులు మాట్లాడుతూ 2024లో జరగనున్న సాధారణ, లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్ల సర్వే వివరాలు సేకరించనున్నట్లు తెలిపారు. సేకరించిన వివరాలను రాష్ట్ర ఎన్నికల అధికారికి పొందుపర్చనున్నట్లు తెలిపారు.పలు బృందాలు కార్యక్రమంలో పాల్గొన్నాయని తెలిపారు.

ఎన్నికలకు సిద్ధం కండి

సీతంపేట: దేశంలోతో పాటు రాష్ట్రంలో రాబోవు ఎన్నికలకు సిద్ధం కావాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బక్క పరంజ్యోతి పిలుపునిచ్చారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం జరిగిన పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, తమ పార్టీని ప్రత్యామ్నాయంగా చూపాలన్నారు. భవిష్యత్ కార్యాచరణపై కార్యవర్గ సభ్యులతో చర్చించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బోను కృష్ణ, జిల్లా ఇన్‌చార్జులు సిహెచ్.ప్రభాకర్, బొడ్డపాటి వెంకటరమణ, దివకాల గంగరాజు, కనకమహాలక్ష్మి పాల్గొన్నారు.



59వ వార్డులో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ నాయకులు



రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఆనంద్‌కుమార్, పుర్రె సురేష్‌యాదవ్



61వ వార్డు మల్కాపురం వద్ద..



58వ వార్డులో వృద్ధురాలికి పండ్లు పంచుతున్న నేతలు

ప్రజానేతకు.. ప్రణామం

ప్రజారంజక పాలనకు అసలైన అర్థం చెప్పిన నాయకుడు దివంగత నేత వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి అని పారిశ్రామికవాడ వైఎస్సార్‌సీపీ నాయకులు కొనియాడారు. శనివారం పలు వార్డుల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి నిర్వహించి.. ప్రజానేతకు నివాళులు అర్పించారు. ఆయన ఆశయాలు కొనసాగిస్తూ.. ప్రజా సంక్షేమానికి పాటుపడటమే ఆయనకు మనం ఇచ్చే నివాళి అని నాయకులంతా సంకల్పించారు.

- పారిశ్రామికవాడలో పలు చోట్ల దివంగత నేత వైఎస్సార్ వర్ధంతి
- ఆయన అందించిన సంక్షేమాన్ని గుర్తు చేసుకున్న ప్రజలు
- మహానేత ఆశయాల కొనసాగింపే ఆయనకు నిజమైన నివాళి అని నాయకుల ఉవాచ

మల్కాపురం : పారిశ్రామిక ప్రాంతంలోని పలు వార్డుల్లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతిని వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన రక్తదాన శిబిరంలో 59వ వార్డు ప్రాంతానికి చెందిన పలువురు యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావుతో పాటు పారిశ్రామిక ప్రాంత ట్రేడ్ యూనియన్ నాయకుడు పుర్రె సురేష్‌యాదవ్, నర్సింగ్‌యాదవ్ తదితరులు రక్తదానం చేశారు. ఇదే వార్డులో నక్కవానిపాలెం వద్ద కొంత మంది వైఎస్సార్ అభిమానులు సత్యసాయి చిత్రపటం పక్కన వైఎస్సార్ ఫొటో పెట్టి పూజలు చేశారు. 58వ వార్డు పిలకవానిపాలెం డాక్టర్ వైఎస్సార్ విగ్రహం వద్ద గులిగిందల కృష్ణ, చుక్క వరలక్ష్మి వేర్వేరుగా దివంగత నేత వర్ధంతి నిర్వహించి పేదలకు పండ్లు పంచిపెట్టారు. 61వ వార్డు మల్కాపురం వద్ద స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మహానేతకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పిలక మహేష్‌రెడ్డి, కామేష్, ఎస్.నూకరాజు యాదవ్, బూస అప్పలరెడ్డి, కొల్లి నూకరెడ్డి, పీలా అనంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పలు వార్డుల్లో..

గోపాలపట్నం : ఇక్కడి జీవీఎంసీ 52వ వార్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వైఎస్సార్‌కు పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ పేదలకు ఆరోగ్య ప్రదాతగా నిలిచారన్నారు. 108, 104 వంటివి ప్రవేశపెట్టారని గుర్తు చేవారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కార్యకర్తలు, నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో కంటి పరీక్షలు చేసుకున్నారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. బెహరా భాస్కరరావు, కలిదిండి బద్రీనాథ్, బీఎస్ కృష్ణ, శ్రీదేవివర్మ, బాకి శ్యామ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- 92వ వార్డు పద్మనాభనగర్‌లో పశ్చిమ సమన్వయ కర్త ఆడారి ఆనంద్‌కుమార్, జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో 91, 92 వార్డుల పార్టీ అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి నాయుడు, కంపర సత్తిబాబు, నీలాపు శ్రీనివాసరెడ్డి, కంచిపాటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.
- జీవీఎంసీ 52వ వార్డు ఎన్ఏడీ జంక్షన్‌లో వైఎసార్ విగ్రహానికి మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ, జియ్యాని మారుతి, సింహాచలం దేవస్థానం పాలక మండలి సభ్యురాలు శ్రీదేవివర్మ, వెదుళ్ల శ్రీనివాసరావు తదితరులు వైఎస్సార్‌కు నివాళులర్పించారు.
- 89వ వార్డు కొత్తపాలెంలో ఆ వార్డు నాయకుడు అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ ఇంటి వద్ద వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాలులర్పించారు. స్థానిక నాయకులు కార్కర్తలు పాల్గొన్నారు.



40వ వార్డులో వైఎస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు

రాజన్నకు నమస్సుమాంజలి

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు గుడివాడ అప్పన్నకాలనీలో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని అట్టహాసంగా నిర్వహించారు. జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదప్రజలకు పండ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు.

- జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీలోని మహానేత వైఎస్సార్ విగ్రహానికి వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు జాతి ఉన్నంత కాలం చరిత్రలో వైఎస్ రాజశేఖరరెడ్డి నిలిచిపోతారన్నారు.



వైఎస్సార్‌సీపీ పశ్చిమ పార్టీ కార్యాలయంలో మహానేతకు నివాళులర్పిస్తున్న ఆనంద్‌కుమార్



కంటి వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఆనంద్‌కుమార్



పద్మనాభనగర్‌లో వైఎసార్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఆనంద్‌కుమార్, బెహరా భాస్కరరావు



వైఎస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న 62వ వార్డు నాయకులు

సీఎం సహాయ నిధి చెక్ అందజేత



రిషి కోమలి తల్లికి చెక్కు అందిస్తున్న ఆడారి ఆనంద్ కుమార్

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డుకు చెందిన రిషి కోమలి అనారోగ్యంతో ఇబ్బంది పడింది. ఆమె శస్త్ర చికిత్సకు రూ.70 వేల వరకూ ఖర్చు అయింది. అయితే పేద కుటుంబం కావడంతో సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేయగా రూ.30 వేలు మంజూరు అయ్యాయి. ఆమె తల్లికి శనివారం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వచ్చిన రూ.30వేల చెక్కును పశ్చిమ నియోజకవర్గ సమన్వయ కర్త ఆడారి ఆనంద్ కుమార్ అందించారు. తమకు సహాయం చేసిన డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, పశ్చిమ సమన్వయ కర్త ఆడారి ఆనంద్‌కుమార్‌కు రిషి కోమలి తల్లి కృతజ్ఞతలు తెలిపారు.

పింఛన్లు అందజేత

గోపాలపట్నం: నూతనంగా మంజూరైన పింఛన్లను పశ్చిమ సమన్వయ కర్త ఆడారి ఆనంద్ కుమార్ పార్టీ కార్యాలయంలో శనివారం లబ్దిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉండి పింఛన్లు అందనివారిని గుర్తించి నూతనంగా మంజూరు చేశామన్నారు. 52వ వార్డులో 21, 56వ వార్డులో 30, 57వ వార్డులో 22 మందికి నూతన పింఛన్లు అందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నూతన సీజీఎంకు హెచ్ఎంఎస్ అభినందనలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ వర్క్స్ డివిజన్ సీజీఎం ఎన్.వి. స్వామిని స్టీల్ హెచ్ఎంఎస్ నాయకులు అభినందించారు. నూతన సీజీఎంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా వారు శాలువా కప్పి, బొకే అందజేశారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జి.గణపతిరెడ్డి, డి.అప్పారావు, జి.అప్పలరాజు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆనంద్‌కుమార్ సొంత నిధులతో పింఛన్ల పంపిణీ



58వ వార్డులో దివ్యాంగుడికి పింఛన్ ఇస్తున్న నాయకులు




60వ వార్డులో మంచంపై ఉన్న వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న దృశ్యం

మల్కాపురం: వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ తన మానవత్వాన్ని మరోసారి చాటుకున్నారు. పలు సాంకేతిక కారణాల వల్ల పింఛన్ అందని వారికి తన తండ్రి పేరిట ఏర్పాటు చేసిన ఆడారి తులసీరావు చారిటబుల్ ట్రస్టు ద్వారా ప్రతి నెలా తన సొంత నిధులతో పింఛన్ ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. దీనిలో భాగంగా 58వ వార్డు పరిధిలో ఓ దివ్యాంగుడికి, 60వ వార్డు పరిధిలో మంచంపై ఉన్న వృద్ధురాలు రమణమ్మతో పాటు మరికొందరికి ఆయన సొంత నిధులతో ప్రతి నెలా పింఛన్ అందిస్తున్నారు. దీనిలో భాగంగా ఈ నెల కూడా ఆయా వార్డుల పార్టీ నాయకులు శనివారం లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేశారు.


ప్రపంచ స్థాయికి తెలుగు సినిమా

సీతంపేట: వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో 'తెలుగు సినిమా పోకడలు' అనే అంశంపై సీనియర్ సినిమాటోగ్రాఫర్, కళ్లు సినిమా డైరెక్టర్ ఎం.వి.రఘుతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ్లు సినిమా విశాఖలోనే నిర్మించామని, 30 ఏళ్లు గడిచినా ఆ చిత్రం గురించి ఇంకా మాట్లాడుకోవడం ఆనందంగా ఉందన్నారు. తెలుగు సినిమా ప్రపంచ స్థాయికి ఎదిగిన తీరును వివరిస్తూ ప్రతి 20 ఏళ్లకు సినిమా ప్రేక్షకుల అభిరుచులు, వేష భాషలు మారుతుంటాయన్నారు. వాటిని పసిగట్టి తీసిన సినిమాలే బాక్సాఫీస్‌లో నిలబడుతున్నాయని చెప్పారు. ఇటీవల యువత ముందుకొచ్చి సినిమాలు తీయడం, అవి ప్రేక్షకుల ఆదరణ పొందడం శుభ పరిణామమన్నారు. ఇటీవల అల్లు అర్జున్‌కు జాతీయ ఉత్తమ నటుడు అవార్డు, ఆర్ఆర్ఆర్ పాటకు ఆస్కార్ అవార్డు రావడం ఆనందంగా ఉందన్నారు. విశాఖ జిల్లా సినిమా అభివృద్ధికి అనువైనదని, ప్రభుత్వం చొరవ చూపాలని సూచించారు. ప్రేక్షకులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ ఎం.వి.రఘు సుమారు 70 సినిమాలకు సినిమాటోగ్రాఫర్‌గా పనిచేసి కళ్లు సినిమాతో ప్రాచుర్యం పొందారన్నారు. అనంతరం రఘును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శ్రీమన్నారాయణ, హస్సన్, ఛాట్ల బాబూరావు, బి.చిన్నారావు, ఉషారాణి పాల్గొన్నారు.



సినిమాటోగ్రాఫర్ రఘును సత్కరిస్తున్న నరవ ప్రకాశరావు

అష్టలక్ష్మీదేవి సహిత మహాలక్ష్మికి కుంకుమార్చన



ప్రత్యేక అలంకరణలో మహాలక్ష్మి



కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు

సీతంపేట: శ్రీవెంకట అన్నమాచార్య సేవా ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం శంకరమఠంలో అష్టలక్ష్మీదేవి సహిత మహాలక్ష్మి అమ్మవారి కుంకుమార్చన నిర్వహించారు. శ్రీరామ్ రామ్ గురూజీ పర్యవేక్షణలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా అన్నమాచార్య సేవా ట్రస్ట్ ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల డైరెక్టర్ కొఠారి సునీత మాట్లాడుతూ తాళ్లపాక స్వామీజీ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. రామ్ రామ్ గురూజీ మాట్లాడుతూ శ్రావణ మాసంలో ఇటువంటి పూజలు చేయడం వల్ల జనులందరూ ఆయురారోగ్యాలు, అష్ట ఐశ్వర్యాలతో ఉంటారన్నారు. ప్రతి ఒక్కరూ శ్రావణ మాసంలో ఇటువంటి పూజలు చేయాలన్నారు. కుంకుమార్చన కార్యక్రమాన్ని భక్తుల నుంచి ఎటువంటి రుసుం తీసుకోకుండా నిర్వహించిన అన్నమాచార్య ట్రస్టు సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సుమారు 500 మంది మహిళలు పాల్గొన్నారు.

సెయింట్ జోసెఫ్‌లో తిజారా ఫెస్ట్



విద్యార్థులకు మెమొంటోలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో కామర్స్, మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో శనివారం తిజారా ఫెస్ట్ ఘనంగా నిర్వహించారు. ఫెస్ట్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, ఎవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సింహాద్రి నాయుడు ప్రారంభించారు. విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా యువ పారిశ్రామికవేత్తల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ జ్యోతి, పీకే జయలక్ష్మి, డాక్టర్ రజని తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయాల్లో విశేష పూజలు



సంపత్ వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

కంచరపాలెం: శ్రావణ మాస శుద్ధ విదియ సందర్భంగా శనివారం స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. గొల్లకంచరపాలెం కోదండ సీతారామ, ధనలక్ష్మీ దేవి, సంపత్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకుడు శ్యామాచార్యులు ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, అష్టోత్తరాలు, తులసీదళ బిల్వార్చనలు చేశారు. శ్రీరామా సేవా సమాజం(యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

జోన్-5లో 91.13 శాతం పింఛన్ల పంపిణీ

కంచరపాలెం: జీవీఎంసీ జోన్-5 పరిధిలోని విశాఖ పశ్చిమ, ఉత్తర నియోజక వర్గాల్లోని 24 వార్డుల పరిధిలో శనివారం నాటికి 91.13 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్టు జెడ్సీ ఆర్జీవీ కృష్ణ తెలిపారు. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, డయాలసిస్ రోగులు, ఇతరత్రా పెన్షన్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. మొత్తం 26,529 మంది పింఛదారులకు గానూ శనివారం నాటికి 25859 మంది పింఛన్‌దారులకు రూ. 6.85 కోట్లు అందజేశారు. దీంతో దాదాపు 91.13 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తి చేసినట్లు యూసీడీ ఏపీడీ పద్మావతి తెలిపారు. లబ్ధిదారులకు పింఛన్లు సచివాలయ కార్యదర్శుల సమక్షంలో వలంటీర్లు, నాయకులు అందించారు. ఆదివారానికి 100 శాతం పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని జెడ్సీ కృష్ణ తెలిపారు.



గొల్లకంచరపాలెంలో పింఛన్ అందిస్తున్న పల్లా ఎర్ని కుమార్, సాయిలత, వలంటీర్లు

జోన్-5 పరిధిలో పెన్షన్ నగదు పంపిణీ వివరాలు ఇలా....

వార్డు	పెన్షన్‌దారులు	నగదు అందుకున్న పెన్షన్‌దారులు	శాతం..
40	422	399	94.54
41	904	869	96.12
42	912	822	90.13
43	1450	1385	95.51
44	1183	1153	97.46
45	822	812	98.78
46	1311	1292	98.55
47	1174	1099	93.61
48	1181	1169	98.98
49	1685	1668	98.99
50	628	618	98.40
51	999	978	97.89
52	700	698	99.71
53	773	738	95.47
54	1033	1021	98.83
55	1163	1153	99.15
56	1352	1299	96.07
57	1122	1102	98.21
58	1371	1350	98.46
59	1319	1302	98.71
60	1418	1386	97.74
61	1343	1258	93.67
62	1154	1103	95.58
63	910	889	97.69

సడలని ఉక్కు ఉద్యమం



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: దేశంలోని ఏ పరిశ్రమ కోసం కూడా ఇంతటి సుదీర్ఘ పోరాటం జరిగిన చరిత్ర లేదని, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు చేస్తున్న విశాఖ ఉక్కు దీక్షకే ఈ ఘనత దక్కుతుందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న 933వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో శనివారం సంస్థలోని పలు విభాగాల కార్మికులు పాల్గొని దీక్షకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులనుద్దేశించి పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని, విశాఖ ఉక్కు దీక్షను స్ఫూర్తిగా తీసుకుని దేశ వ్యాప్తంగా కార్మిక వర్గం ఐక్యంగా ఉంటూ ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. ప్లాంట్‌లో ఉన్న విభాగాలను పునఃప్రారంభించి ఉత్పత్తిని పెంచాలన్నారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సమావేశాల్లో పరిశ్రమను ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగిస్తున్నట్లు ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. అర్చకులు శ్రావణ్ తదితరులు ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదంతో పాటు శేషవస్త్రాలు అందజేశారు.